# పేదలకు సొంత ఇల్లు ఉండాలన్నదే నా లక్ష్యం..



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడలో నిర్వహించిన ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

- బాన్సువాడ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను..
- నేను మీవాడిని.. మీ కుటుంబ సభ్యుడిని.. నిండు మనస్సుతో ఆశీర్వదించండి
- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/బాన్సువాడ రూరల్,, నవంబర్ 28 : బాన్సువాడ పట్టణంలో ఇల్లు, స్థలం లేని పేదలకు సొంత ఇల్లు ఉండాలన్నదే నా లక్ష్యమని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడలో మంగళవారం పోచారం శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 19 వార్డుల నుంచి వేల మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, మహిళలు, యువకులు, పోచారం అభిమానులు స్వచ్ఛందంగా పోచారం ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత స్థలం, ఇల్లు లేక కిరాయికి ఉంటున్న పేదలందరికీ తాడ్కోల్ శివారులో ఉన్న 14 ఎకరాల స్థలంలో ఇల్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువత కోసం పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేసి, ఈ ప్రాంత బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బాన్సువాడ పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీరు ఇచ్చేలా రూ.52 కోట్లతో అమృత్ పథకం కింద తాగునీటి ప్రాజెక్టు మంజూరు అయిందని తెలిపారు. మిషన్ భగీరథ తాగునీరు వచ్చేలా పైప్‌లైన్లు ఏర్పాటు చేయించానని చెప్పారు. మై పక్కా లోకల్.. బాన్సువాడకే పబ్లిక్ పక్కా లోకల్.. పక్కా నియోజకవర్గం నుంచి వచ్చి ఏనుగు రవీందర్‌రెడ్డిని బాన్సువాడ ప్రజలు తంతే బంగాళాఖాతంలో పడాలని, బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పోచారం పిలుపునిచ్చారు. బాన్సువాడ నియోజకవర్గానికి 11 వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు తెచ్చి పేదలకు ఇచ్చానని అన్నారు. పదేండ్లల్లో బాన్సువాడను అద్భుతంగా అభివృద్ధి చేశానని చెప్పారు. నేను మీ వాడిని.. మీ కుటుంబ సభ్యుడిని.. నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను పోచారం విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో వేలాదిగా తరలివచ్చిన అక్కా చెల్లెలకు, అన్నదమ్ములకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రచారంలో మహిళల నృత్యాలు, డ్యాన్సులతో, జై పోచారం, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, మహ్మద్ ఎజాస్, పిట్ల శ్రీధర్, గోపాల్‌రెడ్డి, వాహబ్, ఖమ్రొద్దీన్, మీరా సేట్, ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఖాన్, ఎఎంసీ వైస్ చైర్మన్ రాజు, అందెరాజు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రమన్ను కుచ్చలో స్పీకర్ పోచారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచు రాజమణి, జడ్పీటీసీ పద్మ, బుడ్మి సొసైటీ చైర్మన్ గంగారాం, నాయకులు గోపాల్‌రెడ్డి, రాజు, లక్ష్మాగౌడ్ తదితరులు ఉన్నారు.

# ఆలోచించి ఓటు వేయాలి

## స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

రుద్రూర్ నవంబర్ 28 : నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఆలోచించి ఓటు వేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొందాపూర్, రుద్రూర్ గ్రామాల్లో మంగళవారం స్పీకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందాపూర్ గ్రామానికి రోడ్లు, పాఠశాల భవనాలు, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు లాంటి ఎన్నో అభివృద్ధి పనులు చేసుకున్నామని అన్నారు. ఇంకా చేయాల్సిన పనులేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వృద్ధులకు ఓటు వేసే విధానాన్ని వివరించారు. రుద్రూర్‌లో భారీగా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్కపల్లి సుజాతా నాగేందర్, జడ్పీటీసీ గంగారాం, పార్టీ గ్రామాధ్యక్షుడు తొట్ల గంగారాం, పార్టీ మండల కార్యదర్శి బాలరాజు, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి, సయ్యద్ రాజయ్య, సర్పంచ్ కోర్వ భాగ్య, మహిళా అధ్యక్షురాలు భాగ్య, రాజయ్య, బాలు, సయ్యద్ తదితరులు ఉన్నారు.




రుద్రూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

## బీఆర్ఎస్‌కు మాల సంఘాల జేఏసీ మద్దతు



మాట్లాడుతున్న రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ రాంచంద్రం

కామారెడ్డి, నవంబర్ 28 : సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ మాల సంఘాల పూర్తి మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచంద్రం అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాల సంఘాలకు సంబంధించి హైదరాబాద్‌లో 5 ఎకరాల స్థలం, రిజర్వేషన్ లాంటివి పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, అందుకే రాష్ట్రంలోని 33 లక్షల మాల సంఘాల మద్దతు ఇస్తున్నామన్నారు. అన్ని సామాజిక వర్గాలు బీఆర్ఎస్‌కు అండగా ఉండి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ లాంటి నాయకుడు కామారెడ్డి నుంచి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. ఇతర నియోజకవర్గాల కన్నా అధికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చీఫ్ అడ్వైజర్ రావుల అంజయ్య, కన్వీనర్ నల్లాల కనకరాజు, వైస్ చైర్మన్ అనిల్, నాను, కో కన్వీనర్ మాధవరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో కాంగ్రెస్ బరితెగింపు

- స్థానికంగానే కొడంగల్ బృందాలు
- ఎలక్షన్ ఏజెంట్ల పేరుతో ఇక్కడే తిష్ట
- కాంగ్రెస్ నాయకుడి ఆఫీసులో సోదాలు
- డబ్బు సంచులున్నట్లుగా అనుమానం?

నిజామాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి నియోజకవర్గంలో ప్రజా బలాన్ని పొందలేక పోయిన పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తనదైన మార్కుతో గలాబా సృష్టించేందుకు సిద్ధమయ్యాడు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటల తర్వాత ప్రచారతంతు ముగిసింది. ఈ దశ దాటిన తర్వాత నాన్ లోకల్ క్యాండిడేట్లు నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాల్సి ఉంటుంది. కానీ రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి మాత్రం ఎలక్షన్ ఏజెంట్ ధ్రువీకరణ పత్రం ఉందంటూ ఇక్కడే తిష్ట వేసుకొని ఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు.. కొండల్ రెడ్డి ఉంటున్న ప్రాంతానికి వెళ్లగా వారితో అడ్డదిడ్డంగా మాట్లాడటంతో పాటు ఇక్కడే ఉంటానంటూ చెప్పడంతో పరిస్థితి తీవ్రరూపం దాల్చింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన కామారెడ్డి పట్టణ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన రియల్‌ఎస్టేట్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంతో పాటు ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అక్రమంగా నగదును తరలిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ కార్యాలయంలో డబ్బుల సంచులున్నట్లుగా గుర్తించినట్లుగా ప్రాథమికంగా తెలిసింది.

**అనుమానాలెన్నో?**

సాధారణంగా ఆయా పార్టీలకు అభ్యర్థుల తరపున ఎలక్షన్ ఏజెంట్ పాస్‌లను ఈసీ జారీచేస్తుంది. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఓటర్ల వివరాలను చెక్ చేసుకొని పంపించడం వీరి పని. అయితే ఇందులో స్థానికుడు కానటువంటి కొండల్ రెడ్డికి ఎలక్షన్ ఏజెంట్ పాస్ ఎందుకు అవసరం వచ్చిందన్నది ప్రశ్నగా మారింది. ఇదిలా ఉండగా కొండల్‌రెడ్డి పేరు మీద జారీ చేసిన పాసులో స్వతంత్ర అభ్యర్థి తరపున రేవంత్‌రెడ్డి సోదరుడు పాస్ పొందినట్లుగా తెలుస్తున్నది. అందులో వివరాలను ఎ.కొండల్ రెడ్డి అని పేర్కొన్నప్పటికీ పోటీచేస్తున్న అభ్యర్థి పేరు స్థానంలో మాత్రం వివరాలు సరిగా కనిపించకుండా జాగ్రత్త పడుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. రేవంత్‌రెడ్డి ఏకంగా పీసీసీ చీఫ్ హోదాలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తుండగా.. ఆయన సోదరుడు కొండల్‌రెడ్డికి మాత్రం స్వతంత్ర అభ్యర్థి తరపున ఏజెంట్ పాస్ ఎందుకు అవసరం వచ్చిందనే విషయంపై కొండల్‌రెడ్డి నోరు విప్పడం లేదు. ఒకవేళ ఎలక్షన్ ఏజెంట్ పాస్ తీసుకున్నప్పటికీ పోలింగ్ రోజు మాత్రమే వారికి ఆ పాస్‌తో పని ఉంటుంది. ప్రచారం ముగిసిన తర్వాత సంబంధిత నియోజకవర్గంలో ఇంతటి హైడ్రామాకు తెరలేపడంలో కాంగ్రెస్ పార్టీ ఉద్దేశం ఏమిటన్న చర్చ ప్రజల్లో జరుగుతన్నది.

**కాంగ్రెస్ నేత ఆఫీస్‌లో నోట్ల సంచులు..**

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ పోలింగ్‌కు ముందు భారీ స్కెచ్ వేసింది. ఓటర్లకు డబ్బులు ముట్టజెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తుండడంతో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. సమాచారం అందుకున్న ఎన్నికల సంఘం ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించింది. కాంగ్రెస్ పట్టణ నాయకుడు శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన కార్యాలయంలో నోట్ల సంచులున్నట్లుగా అనుమానంతో ఫిర్యాదు రాగా ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ కార్యాలయంలో డబ్బుల సంచులు దొరికినట్లుగా తెలుస్తోంది. ఈ మొత్తం విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని తెలిసినప్పటికీ విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్, ఎన్నికల నిఘా బృందాలు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఈ మొత్తం డబ్బుల కట్టలను ఓటర్లను ప్రలోభ పెట్టేందుకే తీసుకు వచ్చినట్లుగా అనుమానిస్తున్నారు. ఇన్‌కం టాక్స్ అధికారులు సైతం రంగంలోకి దిగి ఆ మొత్తానికి సంబంధించిన వివరాలకు ఆధారాలను కోరుతున్నట్లుగా సమాచారం.

**కామారెడ్డిలో కన్నడ నేతలు..**

పోలింగ్‌కు ముందు రోజు ఏదో ఒక అలజడి సృష్టించి జనాల్లో భయాందోళనలు సృష్టించాలనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ కుట్రలకు పాల్పడుతోందని తెలుస్తోంది. సోమవారం అర్ధరాత్రి భిక్కనూర్ మండలంలో అనుమానాస్పదంగా కర్ణాటకకు చెందిన వాహనాల్లో పలువురు సంచరించారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనిఖీలు చేపట్టగా సర్వే కోసం వచ్చినట్లుగా వారు సమాధానం ఇచ్చారు. పోలీసులు మాత్రం పరస్పర ఫిర్యాదులు స్వీకరించారు. కామారెడ్డిలో తిరుగుతున్న కన్నడ వ్యక్తులు కాంగ్రెస్ సానుభూతిపరులేనని అనుమానం వ్యక్తం అవుతున్నది. మొదట్నుంచి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి కర్ణాటకకు చెందిన ముఖ్య నేతలంతా తెర వెనుక సపోర్టు చేస్తున్నారు.